## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-12-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ద్వైతం అంటే ఏమిటి? అద్వైతం అంటే ఏమిటి? అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. భగవాన్ ఎంత బాగా చెప్పారు అంటే నీకు దేహంతో కనుక తాదాత్మ్యం ఉంటే ద్వైతం, నీకు దేహంతో తాదాత్మ్యం ఏమీలేదు అనుకో అది అద్వైతం అని చెప్పారు. ఈ వాక్యం పూర్వం ఎక్కడా చదవలేదు. నేను ఆశ్చర్యపోయాను. ద్వైతం గురించి, అద్వైతం గురించి ఇంత సింపుల్‌గా చెప్పినవాడు అసలు లేడు. నువ్వు పుస్తకాలు చదవటం వలన అద్వైతస్థితిని పొందలేవు. నీ శరీరంతోటి నీకు కనుక తాదాత్మ్యం లేకపోతే అది అద్వైతానుభవం. అప్పుడు నీకు అద్వైతానందం వస్తుంది. అంటే అది ఇతర మనుషులవల్లగాని, ఇతర వస్తువుల వల్లగాని, సాపేక్షికవిషయాల వల్లగాని వచ్చే సంతోషంకాదు. ఎప్పుడైతే నీకు దేహంతో తాదాత్మ్యం పోయిందో అప్పుడు నీకు బ్రహ్మంతో ఏకత్వం వస్తుంది. ఎవడికైతే బ్రహ్మంతో ఏకత్వం వచ్చిందో వాడికి బ్రహ్మానందం వస్తుంది. అద్వైతం అనేది ఒక అనుభవం అది నోటితో చెప్పేదికాదు. దక్షిణామూర్తి అంటే శివుడి యొక్క అవతారం. ఆయన కూడా బ్రహ్మం గురించి మాటలలో చెప్పలేక మౌనం వహించాడు. ఆయన శిష్యులకు మౌనంగానే బ్రహ్మస్వరూపాన్ని వ్యక్తపరిచాడు. ప్రపంచంలో ఇంతవరకు ఎంగిలికాని వస్తువు ఏదైనా ఉంది అంటే అది బ్రహ్మమే. ఎంగిలికాని వస్తువు అని ఎందుకు అంటున్నారు అంటే అది నోటితో చెప్పేదికాదు, అది మౌనం ద్వారా వ్యక్తమవుతుంది.

భగవాన్ ఏ సన్యాసికి ఎప్పుడూ ప్రత్యేకంగా గౌరవం ఇవ్వలేదు. అది ఆశ్చర్యం. అసలు గృహస్థులకు, సన్యాసులకు ఏమీ తేడాలేదు అని చెప్పారు. గృహస్థులు మేము గృహస్థులం అనుకొంటున్నారు. సన్యాసులు మేము సన్యాసులం అనుకొంటున్నారు. అదీ తలంపే, ఇదీ తలంపే. వాడికీ దేహబుద్ధి పోలేదు, వీడికీ దేహబుద్ధి పోలేదు. తరువాత సన్యాసుల దగ్గర ఇంకో గొడవ ఉంది. గృహస్థులకంటే మేము ఎక్కువ అనుకొనే అహంకారం ఉంది. బట్టలు మార్చుకుంటే జ్ఞానం వస్తుందా? తలకాయ ముండనం చేయించుకుంటే జ్ఞానం వస్తుందా? అలా రాదు. రామకృష్ణపరమహంసగారికి మనుషుల మీద ప్రేమ ఉంది. ఆయన దగ్గర పది నిమిషాలు కూర్చుని మాట్లాడుతూ ఉంటే ఆయన మనపట్ల ఎంత ప్రేమగా ఉన్నాడో మనకు తెలుస్తుంది. అయితే రమణమహర్షిగారిది మూగ ప్రేమ, ఆయనది సైలెంట్ లవ్. ఆయన మిమ్మల్ని పరిమితులు లేకుండా ప్రేమిస్తాడు కాని అది మీకు తెలియనివ్వడు. అది సైలెంట్‌గా ప్రవహిస్తుంది. ఏ జ్ఞానికూడా తోటిమానవుడిని ప్రేమించాలని ప్రేమించడు. ఆయన

ప్రేమించకుండా ఉండలేడు కాబట్టి ప్రేమిస్తాడు. భగవాన్‌లో ప్రత్యేకత ఏమిటి అంటే ఆయన మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు అన్న సంగతి కూడా మీకు తెలియనివ్వడు, మీ ప్రక్కన కూర్చొన్న వాడికి కూడా తెలియకుండా మిమ్మల్ని అనుగ్రహిస్తాడు.

భగవాన్ ఏమన్నారు అంటే నేను మనస్సును అంతర్ముఖం చెయ్యాలి అనుకోవటం లేదు. మరణానుభవంలో ఏదో మహాశక్తి నా మనస్సును లోపలకు గెంటుకొనిపోయింది. అంటే ఏ హృదయంలో అయితే భగవంతుడు నివాసంగా ఉన్నాడో, అంతర్యామిగా ఉన్నాడో అక్కడకు నా మనస్సును తోలుకొని పోయి ఆయనతో ఐక్యపరిచింది. మరణానుభవంలో ఈ శరీరం చనిపోయింది, ఈ శరీరాన్ని తీసుకొనివెళ్ళి స్మశానంలో కాల్చేస్తారు. శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోవాలి కదా మరి నేను చనిపోవటంలేదు ఏమిటి? ఈ శరీరం చనిపోయినా నేను సుఖంగా, శాంతిగా ఉన్నాను అని ఆయనకు అనిపించింది. అంటే హృదయంలో ఉన్న అంతర్యామి ఆయనకు నేనుగా వ్యక్తమయ్యాడు. అదే నిజమైన నేను. దానికి శరీరంతోగాని, సమాజంతోగాని, ప్రపంచంతోగాని, దేవుడితోగాని ఎట్టి సంబంధం లేదు. ప్రపంచ ఆధ్యాత్మికచరిత్రలో ఎవరికీ ఇలా జరగలేదు. మరణానుభవంలో ఆయనకు దేహంతో తాదాత్మ్యం పోయింది. ఈ దేహం చనిపోయినా నేను సుఖంగా ఉన్నాను, శాంతిగా ఉన్నాను, ఆనందంగా ఉన్నాను అని నోటితో చెప్పటంకాదు, అది అనుభవైకవేద్యం అయ్యింది.

మీరు మాటలు తేలికగా చెపుతున్నారు ఒక్క గంట కూడా సాధన చెయ్యకుండా మీకు బ్రాహ్మీస్థితి కలిగింది. సాధన పేరు మీద మేము పడే తిప్పలు, మేము పడే బాధలు మీకు ఏమి తెలుస్తాయి, మీరు ఎప్పడైనా సాధన చేస్తేకదా తెలియటానికి అని కొంతమంది భగవాన్‌తో అనేవారు. ఆయన ఏమని చెప్పేవారు అంటే సాధన పేరు చెప్పి మీరు ఏదైతే కష్టం, కష్టం అని అనుకొంటున్నారో ఆ కష్టాలన్నీ నేను పూర్వజన్మలో పడి ఉండవచ్చు. నేను పరిణామంలో వచ్చినవాడినేకాని పైనుండి కిందకు దిగినవాడిని కాదు అని చెప్పారు. అందుచేత ఆయన కామన్‌మేన్‌తో తాదాత్మ్యం పొందేవాడు కాని స్పెషల్‌గా ఇంటర్వ్యూలు ఏమీలేవు. రామకృష్ణపరమహంస దగ్గరకు జంతువులు వచ్చేవి కాదు. రమణమహర్షి దగ్గరకు కోతులు, పాములు, పులులు ఇలా రకరకాల జంతువులు వచ్చి ఆప్యాయంగా ఆయనను చూసి వెళ్ళేవి. భగవాన్ విరూపాక్షగుహలో ఉండగా శృంగేరిపీఠంలో ఉన్న ఒక స్వామి భగవాన్ దగ్గరకు వచ్చారు. ఆయన భగవాన్‌తో మీరు తెల్ల గోచీ పెట్టుకొన్నారు, తెల్లగోచీ బదులు ఎర్రగోచీ పెట్టుకోండి అని సలహా ఇచ్చారు దానికి భగవాన్ ఏమీ

మాట్లాడలేదు, ఆ స్వామిని పట్టించుకోలేదు. ఆయన శృంగేరి వెళ్ళిన తరువాత నేను భగవాన్‌తో ఇలాగ సలహా చెపితే ఆయన నావంక చూడలేదు, ఏమీ మాట్లాడలేదు అని పీఠాధిపతితో చెపితే ఆయన నీదే తప్పు అన్నారు. ఆయన మహర్షి. ఆయన దగ్గరకు వెళ్ళి మనం ఏమి సలహాలు చెపుతాము, ఆయన ఏదైనా చెపితే మనం నేర్చుకోవాలి కాని మనం అక్కడ చెప్పేది ఏమీ లేదు. ఎరుపురంగు గోచీ వేసుకోమని చెప్పటం నీది చాలా పొరపాటు అనిచెప్పారు.

ఆత్మసాక్షాత్కారం పొందినవాడి దగ్గరనుండి కాంతి తరంగాలు, శాంతి తరంగాలు వెదజల్లబడతాయి. మల్లెపూవు దగ్గర కూర్చుంటే వాసన వస్తుంది కాని అందరికీ వాసన యివ్వాలి అని ఆ మల్లెపూవు అనుకోదు. అలాగే ఎవడైతే బ్రాహ్మీస్థితి పొందాడో వాడి దగ్గర నుండి కాంతి తరంగాలు, శాంతి తరంగాలు జనరల్‌గా ప్రవహిస్తూ ఉంటాయి కాని నేను ఇతరులకు ఉపకారం చెయ్యాలని వాడు అనుకోడు. అసలు వాడికి ఇతరులు లేరు. జ్ఞానికి కాలంలేదు, దూరంలేదు, ఇతరులు లేరు. మీరు జ్ఞాని దగ్గర కూర్చుంటే మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా, మీ సాధనతో సంబంధం లేకుండా ఆయన ప్రెజన్స్‌లో మీరు ఏదైతే పొందాలో అది పొందుతూ ఉంటారు. మీరు ఎంత ప్రయత్నం చేసినా అంతర్ముఖంకాని మనస్సు ఒక జ్ఞాని సమక్షంలో మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా అది అంతర్ముఖమవుతుంది. నువ్వురా, నువ్వురా అని ఆయన ఎవరినీ ఆకర్షించడు. ఆయనకు టాంటాం అక్కరలేదు. ఆయన నుండి ప్రవహించే శాంతినిచూసి, కాంతినిచూసి, జ్ఞానాన్ని చూసి ఎంతోమంది ఆకర్షితులవుతారు. ఆ సైలెన్స్‌ను చూసి ఎంతోమంది ఎట్రాక్ట్ అవుతారు. వారు నోటితో మాట్లాడరు, హృదయంతో మాట్లాడతారు. వారి నాలుక హృదయంలో ఉంటుంది. మనకు జ్ఞానికి తేడా ఏమిటి అంటే జ్ఞాని యొక్క హృదయం, మాట, చేత ఒకటిగా ఉంటాయి. అజ్ఞానికి హృదయంలో ఒకటి ఉంటుంది, మాట వేరుగా ఉంటుంది, చేత వేరుగా ఉంటుంది. ఈ మూడింటికి సమన్వయం ఉండదు. అందుచేత మనకు తొందరగా రోగాలు వస్తాయి.

రామకృష్ణపరమహంసగారు నిర్వాణం అయ్యాక, వివేకానంద ఒకసారి పవహారీ బాబా దగ్గరకు వెళ్ళాడు. ఆయనా సిద్ధపురుషుడే. మీరు ఎవరికీ సహాయం చెయ్యకుండా ఈ గుహలో కూర్చొన్నారు అని వివేకానందుడు ఆ బాబాతో అన్నాడు. అప్పుడు బాబా ఏమన్నారు అంటే సహకారం అంటే ఏమిటి? ఎదుటివాడి చేతిలో అరటిపండు పెట్టటం, ఎదుటివాడికి అన్నం పెట్టటం, ఎదుటివాడికి పది రూపాయలు ఇవ్వటం ఇదే సహకారం అనుకొంటున్నావా?

శారీరకంగా చేసేది ఒకటే సహకారం అనుకొంటున్నావు. నీ మనస్సును బాగుచేసి, నీ మనస్సును పవిత్రం చేసి, దానిని అంతర్ముఖం చేసి, నీ చైతన్యస్థాయిని పెంచితే దానికంటే మించిన సహకారం ఏదైనా ఉందా? నీ కళ్లకు కనబడేదే సహకారం అనుకొంటున్నావు. మానసికంగా చేసేది సహకారం కాదా? స్పిరిట్యువల్ హెల్ప్‌కంటే మించిన హెల్ప్ ఏదైనా ఉందా అన్నారు బాబా.

మీరు సత్యంగురించి, బ్రహ్మంగురించి ఎన్ని ఉపన్యాసాలు విన్నా, పుస్తకాలు చదివినా దాని వలన మారుమనస్సు రాకపోతే ఆ పుస్తకాలు ఎందుకు? ఆ ప్రసంగాలు వినటం ఎందుకు? మీరు గంటలు తరబడి వింటే, ఆ చెప్పేవాడి వలన మీరు కొంచెం కూడా బాగుపడకపోతే ఎందుకు వచ్చిన ప్రసంగాలు. ఆ చెప్పేవాడికి బ్రహ్మానుభవం లేనప్పడు ప్రయోజనం సున్నా. ఉపన్యాసాలు వినటం, పుస్తకాలు చదవటం, సత్సంగాలు ఇవన్నీ మంచివే కాని ఇవి రెండోపక్షం. ఎవడైతే బ్రాహ్మీస్థితిని పొందాడో వాడి సమక్షంలో ఉన్నప్పడు ఎంతోకొంత మీ మనస్సు అంతర్ముఖమవుతుంది, పెళ్లికూతుర్ని తెరచాటునుండి చూసినట్లు మీలోపల ఉన్న వస్తువు మీకు స్ఫురిస్తూ ఉంటుంది. నేను కడప వెళ్లినప్పడు అక్కడ ఉన్న రామకృష్ణమఠ్ స్వామీజీతో మీరు మఠాలు చాలాబాగా నడుపుతున్నారు అన్నాను. నా ప్రక్కన ఉన్న గోడకు రామకృష్ణుడి పటం ఉంది. ఏమండీ నాన్నగారు "మేము రామకృష్ణ మఠాలు బాగా నడుపుతున్నాము అని మీరు అంటున్నారు. ఈ మఠాలు మేము కట్టామా? మేము బాగా నడుపుతున్నామా? కాదు. మేము సున్నలం. గోడవంక చూపించి అదిగో రామకృష్ణుడు. ఈ శరీరాల ద్వారా చేయిస్తున్నాడు, మేము చేయలేదు. కోట్లాది రూపాయలు పెట్టి మఠాలు కట్టటం మావల్ల అవుతుందా? ఆయన మా శరీరాల ద్వారా చేయిస్తున్నాడు అంతేగాని మేము చేయటంలేదు. మేము కనీసం ఒకటి కూడా కాదు. మేము సున్నలం అన్న సంగతి మాకు తెలుసు. ఆయన చేయిస్తున్నాడు కాబట్టి మేము చేస్తున్నాము. మమ్మల్ని తీర్చిదిద్దినవాడు ఆయన. మేము ఏమి పొరపాటు చేయకుండా ఉన్నాము అంటే అది మా గొప్పతనంకాదు, ఆయన దయ. ఈ ప్రపంచంలో ఉన్న మఠాలలో సుమారు 1800 మంది సన్యాసులు ఇలా నడుస్తున్నారు అంటే ఇది మావల్ల అవుతుందా? మా ప్రవర్తన మారింది అంటే అది మా తెలివితేటల వలన కాదు, అది ఆయన అనుగ్రహం. మేము కర్తలంకాదు, ఆయనే కర్త. ఇన్ని బిల్డింగులు ఎలా కట్టారు అని మీరు అడుగుతున్నారు. అది వాడి సంకల్పబలం, వాడి అనుగ్రహం".

లక్షలాది సంవత్సరాల నుండి ఈ ప్రపంచం ఉంది. మన శరీరాలు చనిపోయాక

ఇంకా లక్షలాది సంవత్సరాలు ఈ ప్రపంచం ఉంటుంది. అందులో నువ్వెంత? నీ దగ్గర ఉన్న డబ్బు ఎంత? నీ జీవితం ఎంత? వాట్ ఈజ్ మేన్స్ లైఫ్ కంపేర్ టు ఎటర్నిటీ. ఒకవేళ నువ్వు ప్రధానమంత్రి పదవి చేస్తున్నావు అనుకో, నీ ప్రధానమంత్రి పదవి ఎంత? నువ్వెంత? ఈ విశాల ప్రపంచంలో నీ జీవితం ఏపాటిది? నువ్వు ఎంతటివాడివి? నువ్వు ఎందుకు మురిసిపోతున్నావు? దేనిని చూసి మురిసిపోతున్నావు? కాలువలో నీరు ఎలా ప్రవహిస్తుందో నీ దేహప్రారబ్ధాన్నిబట్టి అదృష్టం అయినా దురదృష్టం అయినా అలా ప్రవహించి వెళ్ళిపోతుంది. నీకు అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా అది ఉండదు. ప్రవహించి వెళ్ళిపోతుంది. కాలువలో నీరు చూడండి. వెళ్ళిపోయే నీరు వెళ్ళిపోతుంది, వచ్చే నీరు వస్తుంది. అలాగే ఈ ప్రపంచ ప్రవాహంలో వచ్చేవాళ్ళు వస్తూ ఉంటారు, పోయేవాళ్ళు పోతూ ఉంటారు. ఈ ప్రపంచం కూడా నీటి ప్రవాహంలాంటిదే. నీ శరీరం చనిపోతే ఈ ప్రపంచం ఆగిపోదు. కొన్ని లక్షల సంవత్సరాలు ఈ ప్రపంచం ఇంకా ఉంటుంది.

ఒకడు రామకృష్ణపరమహంసగారికి శుభలేఖ తెచ్చియిచ్చాడు. ఇది శుభముహూర్తమా, అశుభముహూర్తమా అని అడిగారు. అంటే ఆ వచ్చినవాడికి కోపం వచ్చింది. ఏమండీ పెళ్ళిళ్ళు లేకపోతే ఈ ప్రపంచం ఎలా నడుస్తుంది అని అడిగాడు. నువ్వు ప్రపంచం నడవటానికి పెళ్ళి చేసుకొంటున్నావా? నీ కోరిక నెరవేర్చుకోవటంకోసం పెళ్ళి చేసుకొంటున్నావా? చెప్పు. నీకు కోరిక ఉంటే పెళ్ళి చేసుకో. ప్రపంచంకోసం చేసుకొంటాను అంటావు ఏమిటి? నువ్వు పెళ్ళి చేసుకోకపోతే ఈ ప్రపంచ ప్రవాహం ఆగిపోతుందా? నువ్వు ఇటువంటి బడాయి మాటలు చెప్పవద్దు, బయటకు వెళ్ళిపో. లోపల నీ మనస్సు అంతా నల్లగా ఉంది. పైకి తెల్లగా ఉన్నట్లు కనిపించాలని నువ్వు నటిస్తున్నావు.

అభౌతికమైన శాంతి, అభౌతికమైన ఆనందం గురించి ఒక రీలైజ్డ్ సోల్ దగ్గర ఉన్నప్పడే మీకు తెలుస్తుంది కాని పుస్తకాలు చదవటం వలన, ఉపన్యాసాలు వినటం వలన తెలియదు. మీకు రోగం తగ్గాలి. రోగం తగ్గనప్పుడు డాక్టరు ఎంత పెద్దవాడు అయినా ఉపయోగం ఏమిటి? మీరు దుఃఖంలేని స్థితిని పొందాలి. మీకు అశాంతి వస్తూ ఉంటే, దుఃఖం వస్తూ ఉంటే దేనికి ఈ పుస్తకాలు చదవటం, ఉపన్యాసాలు వినటం. మీరు అశాంతిలో నుండి విడుదల కానప్పుడు, మీలో ఏమార్పు రానప్పుడు ఎందుకు ఈ సత్సంగాలు. అంటే సత్సంగాలు చెయ్యవద్దు అనికాదు. ఒక రీలైజ్డ్‌సోల్ ముందు ఇవి అన్నీ తక్కువే. ఒక బ్రహ్మానుభవం పొందినవాడి దగ్గరనుండి నీకు వచ్చే ఆనందం కేవలం చదవటం వలన, వినటంవలన వచ్చేయవు. నీకు లోపల వస్తువు తాలుక అనుభవం రావాలి. దాని తాలుక

అనుభవం నీకు రానప్పుడు ఎన్ని పుస్తకాలు కొనుక్కొని చదువుతావు, ఎన్ని ఉపన్యాసాలు వింటావు. శారీరకస్థితి, మానసికస్థితి దాటితే గాని లోపలఉన్న అంతర్యామి నీకు ఎరుకలోనికి రాడు, వాడు ఎరుకలోనికి వస్తేనేగాని నిజమైన శాంతి, సుఖం ఎలా ఉంటాయో నీకు తెలియదు. శరీరం మరణించినా నువ్వు ఉంటావు అన్న సంగతి నీకు అవగాహన అవ్వాలి, అది తెలిసే వరకు నీకు సుఖం లేదు.

గ్రహస్థితి అంటే గ్రహాలు వాటి ఇష్టం వచ్చినట్లు మిమ్మల్ని నడపవు, మీ దేహప్రారబ్ధాన్ని బట్టి ఆ గ్రహాలు పనిచేస్తాయి. గ్రహబలం కంటే గృహబలం గొప్పది అంటారు. గృహబలం అంటే ఇంట్లో నలుగురు ఉంటే మీరు అందరూ ఐకమత్యంగా ఉంటే, మీరు శాంతిగా ఉంటే మీకు ఐశ్వర్యం పెరుగుతుంది. మీరు ఒకరితో ఒకరు దెబ్బలాడుకొంటూ ఉంటే ఇంక మీ సంపద ఏమి పెరుగుతుంది, ఉన్నది పోతుంది. ఎక్కడ చూసినా రోజూ పేచీలు, పేచీలు. గౌతమబుద్ధుడు ఏమన్నాడు అంటే "ఏముందీ లోకంలో. ఎవరింటికి వెళ్ళి చూడు, ఏ గ్రామం వెళ్ళి చూడు, ఏ దేశం వెళ్ళి చూడు ఇష్టాలు, అయిష్టాలు తప్పించి లోకంలో ఏమీ లేదు." నీకు ఒక మనిషి మీద అయిష్టంగా ఉంటే వాడికి దూరంగా ఉండు అంతేగాని నీకు విరోధం ఎందుకు? విరోధాలు పెట్టుకోవద్దు. అయిష్టం ఉన్నంతమాత్రంచేత విరోధం పెట్టుకోవద్దు, మీకు అయిష్టం ఉంటే దూరంగా ఉండండి. అంటే మీరు ఒక వ్యక్తిపట్ల విరోధం పెట్టుకొంటే మీకు భగవంతుడు జ్ఞాపకంరాడు. ఎవడిమీద అయితే విరోధం ఉందో అస్తమాను వాడే జ్ఞాపకం వస్తాడు, మీకు దైవచింతన రాదు. అదీ ప్రమాదం. అసూయ ఒకటి చాలా ప్రమాదం. మీరు ఎవరిని చూసి అసూయ పడుతున్నారో వారికి ఏమీ నష్టంలేదు కాని మీ ఆరోగ్యం చెడిపోతుంది. ఇంట్లోవారు బాగుపడితే అసూయ పడే వాళ్ళు చాలామంది ఉన్నారు. ప్రపంచంలో అనేకమంది బాగుపడుతున్నారు అలాగే మన ఇంట్లో వాళ్ళు బాగుపడ్డారు అని మనం సంతోషించాలి కాని ఇంట్లోవారు బాగుపడితే బాధపడటం దేనికి? అక్కడి దాక ఎందుకు ఒకే రక్తం పంచుకొని పుట్టిన అన్నదమ్ములలో కూడా ద్వేషం ఉంటుంది.

జరిగిపోయిన గొడవ ఏదో జరిగిపోయింది. వర్తమానకాలాన్ని సద్వినియోగం చేసుకోండి. జరిగిపోయిన గొడవలను చింతించవద్దు. వర్తమానకాలాన్ని బాగా ఉపయోగించుకోండి. జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం తెచ్చుకొంటే మీకు దుఃఖం వచ్చి తీరుతుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు. ఎవరైనా మీకు అపకారం చేస్తే వారిని మన్నించి, క్షమించి వదిలేయండి. ఒకవేళ తిరిగి అపకారం చేయగలశక్తి నీకు ఉన్నా తిరిగి చేయకు. దానివలన నీకు లాభం ఏమిటి అంటే తిరిగి అపకారం చేయగల శక్తి ఉన్నప్పటికీ నువ్వు

ఓర్పుగా ఉన్నావు కాబట్టి భగవంతుడి దయకు పాత్రుడవు అయ్యి ఆయన సన్నిధికి తొందరగా చేరుకొంటావు, రీలైజేషన్ పొందుతావు. ఈ చిన్న చిన్న పనులు కూడా అందంగా చెయ్యండి. అది చిన్న పనే కదా అని అగ్లీగా చేయవద్దు, అశ్రద్ధగా చేయవద్దు. మీరు చేసేవి చిన్న పనులు అనుకోవద్దు, అవి చిన్న పనులు అయినా అందంగా చేయండి. ఎందుచేతనంటే సత్యం అందంగా ఉంటుంది, సత్యం శాంతిగా ఉంటుంది. సత్యానికి ఉన్న అందం ప్రపంచంలో ఎక్కడా లేదు.

భగవాన్ ఒక రహస్యం చెప్పారు. నీకు దేహంతో తాదాత్మ్యం ఉన్నంతకాలం నువ్వు ఎంత పండితుడివి అయినా, నీకు ఎంత ధనం ఉన్నా నువ్వు అనేకంగా ఉంటావు కాని ఒన్‌నెస్‌తోటి నువ్వు ఉండలేవు. ఏదైతే ఒకటిగా ఉందో దానితో ఐక్యం అవ్వాలి అంటే నీకు దేహంతో తాదాత్మ్యం పోవాలి. దేహము నేను అనే బుద్ధి పోతేగాని లోపల ఉన్న వస్తువుతో నువ్వు తాదాత్మ్యం పొందలేవు. దానితో నీకు వన్‌నెస్ రావాలి. అంటేలోపల ఉన్న వస్తువులో నువ్వు ఐక్యం అవ్వాలి అప్పుడుగాని నీకు పునర్జన్మలు ఆగవు. మీ అందరి హృదయాలలో నేను అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు. అది గుర్తించలేక గుడిలో ఉన్న దేవుడి వంక చూస్తున్నాము. ఎందుచేతనంటే నీలో ఉన్న అంతర్యామిని చూడాలంటే నీకు జ్ఞాననేత్రం ఉండాలి. మనకు భౌతికంగా కళ్ళు ఉన్నాయి కాని జ్ఞాననేత్రం లేదు. మీరు ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. భగవంతుడు మీ అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు కాబట్టి ఉన్నాను అని చెపుతున్నాడు, లేడు అనుకో లేను అని చెప్పి ఉండేవాడు. ఈ వాక్యం పట్ల మనకు విశ్వాసం లేదు. మనం పెద్ద పెద్ద ఇళ్ళు కట్టుకొంటున్నాముకాని మన మనస్సులు ఇరుకు అయిపోతున్నాయి. సైన్సు దేహానికి కంఫర్టు ఇస్తుంది కాని మనస్సును కంట్రోలు చేయలేదు.

జ్ఞాని ప్రజలలోకి వెళ్ళి ప్రసంగాలు చేయనక్కరలేదు, పుస్తకాలు ఏమి రాయనక్కరలేదు. ఆయన మౌనంగా ఉండి ఆయన చెప్పవలసిన సందేశం మీకు చెప్పగలడు, వాడు జ్ఞాని. ఆయన మాటతోటి పనిలేదు, రైటింగ్‌తో పనిలేదు, ఊరికే ఆయన ప్రెజన్స్ చాలు మీకు రీలైజేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. బుద్ధుడితో స్నేహం లేకపోయినా బుద్ధుడి మొఖం చూడటం వలన 150 మంది జ్ఞానులు అయ్యారు. ప్రశాంతమైన మొఖం. అందుకే ఆయనను లైట్ ఆఫ్ ఏషియా అంటారు. ఎన్ని గ్రంథాలు చదివినా లోపల ఉన్న అంతర్యామి నీకు అవగాహన కానప్పుడు ఏమిటి ప్రయోజనం? మహర్షులు, యోగులు వారు ప్రజలలోకి వెళ్ళకపోయినా కొన్ని శరీరాలను వారు సాధనాలుగా ఉపయోగించుకొంటారు. రామకృష్ణుడు 16 మంది

భక్తులను సెలెక్ట్ చేసుకొన్నాడు. ఆయన శరీరం పోయినా ఈ 16 మంది శరీరాలను ఉపయోగించుకొన్నాడు, ఆయన సందేశం ప్రపంచం అంతా వ్యాప్తి చెందింది. ఒక్క బ్రాహ్మీస్థితి పొందినవాడు మాత్రమే మిమ్మల్ని చీకటిలోనుండి వెలుగులోనికి తీసుకొని రాగలడు. అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, మీరు ఏదైనా బలమైన వాసనలతో బాధపడుతూ ఉంటే ఆ వాసనలలోనుండి నిన్ను విడుదల చేసేవాడు ఒక్క జ్ఞాని మాత్రమే. ఒక్క జ్ఞాని మాత్రమే భగవంతుడి స్వరూపాన్ని పొందగలడు కాని ఈ కబుర్లు, కాకరకాయలు చెప్పేవాడు ఎవడు పొందలేడు. జ్ఞాని నా స్వరూపాన్ని పొందుతాడు అని భగవంతుడు చెపుతూ అక్కడ ఆయన సంతృప్తి పడలేకపోయాడు. అప్పుడు జ్ఞాని నా స్వరూపాన్ని పొందటంకాదు, వాడే నేను, నేనే వాడు, వాడికి నాకు మధ్యన బేధం చూడవద్దు అని చెప్పాడు. మీరు జ్ఞానికి నమస్కారం చేసినా అది నాకే అందుతుంది. ఎందుచేతనంటే అక్కడ వ్యక్తి లేడు కదా! అందుచేత ఆ నమస్కారం నాకే అందుతుంది అంటే అంతర్యామికే అందుతుంది. నువ్వు తవ్వేది ఏదో ఒక చోటే తవ్వు అప్పుడు నీళ్ళు పడతాయి. పదిచోట్ల గడ్డపార వెయ్యకు, ఒకచోటే పదిసార్లు గడ్డపార వెయ్యి లోపల నుండి నీళ్ళు వస్తాయి. అంటే నీ మనస్సును ఒక్కచోటే ఏకాగ్రం చెయ్యి అప్పుడు నీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. అక్కడ నీకు భక్తి ఉండాలి.

గురువు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు, ఆయన అనుగ్రహస్వరూపుడు. జ్ఞాని యొక్క ఆప్యాయత, ఆయన యొక్క అనుగ్రహం మన కళ్ళకు కనబడదు, చెవులకు వినబడదు. మీ బ్రెయిన్‌తో అర్థం చేసుకోవాలి అంటే ప్రాపంచిక విషయాలను అర్థం చేసుకొన్నట్లు జ్ఞాని యొక్క దయ నీకు అర్థం కాదు, అది నీ బ్రెయిన్‌కు అందదు. జ్ఞాని యొక్క అనుగ్రహం ఎలా ఉంటుంది అంటే భవిష్యత్‌లో అనేక జన్మలు నీకోసం కనిపెట్టుకొని ఉంటాయి అనుకో, వాటిని కత్తిరించటానికి ఒక్క జ్ఞాని మాత్రమే చాలు, ఆయన అనుగ్రహం వాటిని కత్తిరించి వాటి నుండి నిన్ను విడుదల చేస్తుంది. హృదయంలో ఉన్న అంతర్యామి మనకు అనుభవంలోనికి రావాలి అంటే ఏవో పుస్తకాలు చదవటం వలన, ఉపన్యాసాలు వినటం వలన అది సాధ్యం కాదు. ఆయన అనుగ్రహం లేకుండా ఆయనను మనం పొందలేము. కొంతమంది వారి చూపుతో అనుగ్రహిస్తారు. కొంతమంది మాట అనుగ్రహం. రామకృష్ణ పరమహంసగారు శరీరాన్ని టచ్ చేసేవారు. భగవాన్ ఎవరి శరీరాన్ని ముట్టుకొనేవారుకాదు, ఆయన చూపువల్ల, మౌనంవలన అనుగ్రహించేవారు. మిమ్మల్ని అనుగ్రహించటానికి జ్ఞానికి శరీరం అక్కరలేదు. ఎందుచేతనంటే జ్ఞానికి శరీరం ఉన్నప్పుడు కూడా మిమ్మల్ని అనుగ్రహించేది ఆ శరీరం కాదు, అందుచేత ఆ శరీరం పోయినా అనుగ్రహం కంటిన్యూ

అవుతూ ఉంటుంది. సరోజిని నాయుడు తమ్ముడు చటోపాధ్యాయ ఒకమాట చెప్పాడు భగవాన్‌తో అనుబంధం మన కళ్లకు కనబడని సంకెళ్ల వంటిది. మనలను ఎవరైనా సంకెళ్లతో కట్టేస్తే అవి కళ్లకు కనబడుతూ ఉంటే ఆ సంకెళ్లను మనం నరుక్కోగలము. ఆయన మన కళ్లకు కనబడని సంకెళ్లతో మనతో బంధం పెట్టుకొని మనలను అనుగ్రహించేవరకు ఆయన మనలను విడిచిపెట్టడు, ఆయన రమణమహర్షి అని చెప్పాడు.

ఓ అరుణాచలా నువ్వు కొండరూపంలో కనిపిస్తున్నావు. అది తెలియక అమాయకులు దానిని రాళ్లగుట్ట అనుకొంటున్నారు. కాని నువ్వు శాంతి గిరివి, కాంతి గిరివి, నువ్వు మోక్ష ప్రదాత అని ఎవరు గ్రహిస్తున్నారు. మీలో చాలామంది అరుణాచలం చూసివస్తున్నారు కదా! మీకు ఏమైనా గ్రహింపు వచ్చిందా? ప్రతీవాళ్ళు అది రాళ్లగుట్ట అనుకొంటున్నారు కాని ఆ గిరి జ్ఞానప్రదాత, శాంతిప్రదాత అని ఎంతమంది గ్రహిస్తున్నారు. కైలాసంలో శివుడు ఉన్నాడు. ఇక్కడ అరుణాచలంలో ఆ కొండ మీద శివుడు ఉండటంకాదు, ఆ కొండే శివుడు. కొండలోని ప్రతీభాగం కూడా శివ స్వరూపం. ఇక్కడ శివుడు మూడు రూపాలలో ఉన్నాడు 1. గిరి రూపం, 2. లింగ రూపం, 3. సిద్ధ రూపం. సిద్ధరూపం అంటే మనకు శరీరం ఎలా ఉందో మనలాగ శివుడు ఒక శరీరరూపం ధరించి ఉన్నాడు. ఈశ్వరానుగ్రహం లేకుండా మనస్సు అంతర్ముఖం అవ్వదు. ఆయన అనుగ్రహం లేకుండా వాసనాక్షయం అవ్వదు, అన్నింటికంటే వాసనాక్షయం ముఖ్యం. వాసనలు పూర్తిగా క్షీణించకుండా ఒకవేళ మీకు జ్ఞానం కలిగినా అది నిలబడదు. నువ్వు మహాత్ముడివంక చూస్తున్నావు అనుకో, అదే టైములో ఆయన నీ కళ్లలోకి చూసాడు అనుకో, ఆయన కళ్ళు వచ్చి నీ కళ్లతో కలిసాయి అనుకో, ఆ చూపులు చాలు ఇంక మాటలతో పనిలేదు. కొంతమంది పిల్లలకు చూపుతో భయం చెపుతారు. పిల్లలు అల్లరి చేస్తున్నారు అనుకో, వాళ్లను చేత్తోటి కొట్టరు, కళ్లతో అలా చూస్తారు అంతే పిల్లలు అల్లరి మానేస్తారు. ఇది భౌతిక విషయం. మామూలుగా అజ్ఞాని చూపుకే ఇంతశక్తి ఉన్నప్పుడు జ్ఞాని యొక్క చూపుకు ఎంత శక్తి ఉంటుంది, వాడి అనుగ్రహానికి ఎంత బలం ఉంటుంది.

నాకు గురువు రమణమహర్షి అయినా రామకృష్ణుడు అంటే నాకు చాలా ఇష్టం. ఎందుచేతనంటే ఆయనలో కపటంలేదు. ఆ కపటంలేనితనాన్ని చూసి నేను ఆశ్చర్యపోయాను. జ్ఞానియొక్క మౌనం అద్భుతం, అపూర్వం, ఉదాత్తం. జ్ఞాని యొక్క మౌనం నీ మనస్సులో మార్పు తీసుకొని వస్తుంది, నువ్వు మారుమనస్సు పొందుతావు, నీ హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. అయితే ఆ మౌనాన్ని మీరు భరించలేకపోతున్నారు. స్పీచ్ ఈజ్

సిల్వర్, సైలెన్స్ ఈజ్ గోల్డ్ అని చెపుతారు అంటే మాట వెండి, మౌనం బంగారం అంటారు. మీరు వెండి అంటే ఇష్టపడుతున్నారు, బంగారం ఇష్టపడటంలేదు. మౌనదీక్ష అన్నింటికంటే ఉత్తమమైనది. ఆ మౌనంలోనుండి వచ్చే సందేశం మీ ప్రవర్తనలో మార్పు తీసుకొనివస్తుంది, మీ హృదయం యొక్క లోయలను పెంచుతుంది. చలంగారు ఏమన్నారు అంటే నీ చూపుల్లో ఎంత శక్తి ఉందో తెలియకుండా ఇక్కడికి వచ్చాను, వచ్చాక తెలుసుకొన్నాను నీ చూపుల్లో ఉన్న శక్తి ఓచాటుమాటలు లేని చల్లని రమణ అంటారు. చలంగారు పెద్ద రచయిత. ప్రాపంచిక వాసనలు నాలో చాలా ఉన్నాయి. వాటిని నువ్వు క్షీణింపచేయకపోతే నా రచనా శక్తి ఆ వాసనలను క్షీణింపచేయలేదు. అవి నీ అనుగ్రహం వలన క్షీణింపబడవలసిందే. నువ్వు రాకపోతే నేను ఏమి చేయగలను. నువ్వు రాకపోతే అంటే భౌతికం కాదు, నువ్వు నా హృదయంలో ప్రవేశించకపోతే నేను చేసేది ఏమీ లేదు. నీ పద్ధతి ఎలా ఉందంటే నీవు రావు, నన్ను పోనీయవు. నన్ను తలుపు సందున పెట్టి నొక్కేస్తున్నావు. నీ మీద ఇష్టం పోగొట్టుకొందాము అంటే నీ మీద ఇష్టం పోవటంలేదు. పోనీ నాకు జ్ఞానం ఇస్తావా అంటే జ్ఞానం ఇవ్వటంలేదు. అటు చెయ్యటంలేదు, ఇటు చెయ్యటంలేదు. తలుపు సందున పెట్టి నలిపేస్తున్నావు. నీ చూపుల వలన నాకు మత్తు వస్తోంది కాని వాసనాక్షయం ఇంక అవ్వటం లేదు. పోనీ నన్ను వదిలేస్తే నా తిప్పలు ఏవో నేను పడదాము అనుకుంటే నన్ను వెళ్ళనివ్వవు, నువ్వు నాకు జ్ఞానం ఇవ్వవు. నన్ను విడిచిపెట్టవు, నువ్వు నన్ను పట్టుకోవు, ఇదేమి నాటకం. ఇలా సఫరింగ్‌కు గురి అవుతున్నాను. నువ్వు చేసేపని ఏమైనా మర్యాదగా ఉందా అంటారు చలంగారు.

ఈ పని నేను చేసాను, ఈ వ్యవహారం నేను చేసాను అంటే ఇంక వాడికి తోక తెగలేదు, వాడి గొడవ మీకు ఎందుకు అంటాడు రామకృష్ణుడు. వాడు చేసాడా? వాడి ద్వారా ఈశ్వరుడు చేసాడు. ఆ గుర్తింపు లేనివాడు గ్రేట్‌మేన్ ఎలా అవుతాడు. వాడి ద్వారా ఈశ్వరుడు పని చేసాడు అనే బుద్ధి వాడికి లేదు, నేనే చేస్తున్నాను అనుకొంటున్నాడు. వాడు జ్ఞాని ఎలా అవుతాడు. అటువంటివాడు ఎంత పండితుడైన, చరిత్రలో ప్రసిద్ధి పొందిన వ్యక్తి అయిన ఇలా గడ్డిపరక కిందతీసి అవతల పారేస్తాడు. వాడికి ఎంత డబ్బు ఉంటే ఎవడికి కావాలి? వాడికి ఎంత చదువు ఉంటే ఎవడికి కావాలి? వాడికి ఎంత అధికారం ఉంటే ఎవడికి కావాలి? వాడికి తోక తెగలేదు అంటే అహంకారం ఇంకా పోలేదు. వాడిని విడిచిపెట్టేయండి. వ్యక్తిభావన పోకపోతే, దేహభావన వాడికి పోకపోతే వాడు ఎంతటివాడైనా లీవ్ హిమ్ ఎలోన్, వాడిని విడిచిపెట్టేయండి, వాడితో పేచీలు పెట్టుకోనక్కరలేదు, వాడిని

వదిలేయండి అని మెర్సీలెస్‌గా చెబుతాడు రామకృష్ణుడు.

మౌనం ఉత్తమోత్తమమైనది. మనుషుల్లో కూడా కొంతమంది ఉత్తమోత్తములు ఉంటారు. వారిని చూసి మనం సంతోషించవలసిందే కాని వారిలా మనం అవ్వటం కష్టం. వారిని చూసి ఆనందించవలసిందే కాని అలా మనం అవ్వాలి అంటే ఒకోసారి అవ్వలేకపోవచ్చు. వారు పూర్వజన్మలలో ఎంతో కృషి చేసి ఉత్తమోత్తములు అయ్యారు. అలాగ అందరూ అవ్వలేకపోవచ్చు కాని కనీసం వారిని చూసి ఆనందించాలి. అసూయ పడకూడదు. అసూయపడితే నువ్వు పాడైపోతావు, మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం చెడిపోతుంది. ఏదైనా కార్యం జరిగినప్పుడు దానికి ఏదో ఒక కారణం ఉంటుంది. దానినే కార్యకారణ సంబంధం అంటారు. అంటే కారణం లేకుండా కార్యం ఉండదు. ఈ కార్యకారణాలతో సంబంధం లేకుండా మౌనదీక్ష పరిపూర్ణంగా ఉంటుంది. మీకు ఏ కారణం వలన కార్యం జరుగుతోందో ఆ కారణాన్ని జ్ఞాని కత్తిరించేస్తాడు. కారణాన్ని ఎప్పుడైతే కత్తిరించేసాడో ఇంక కార్యం ఉండదు. కార్యకారణాలకు అతీతంగా ఈశ్వరునికృప ఉంటుంది. మీలో ఎవరినైనా ఈశ్వరుడు అనుగ్రహిస్తే వారిని ఎందుకు అనుగ్రహించావు, నన్ను ఎందుకు అనుగ్రహించలేదు అని అడగటానికి వీలులేదు. ఏమో ఆయన ఎందుకు అనుగ్రహించాడో, వాడు పైకి కామన్‌గా కనిపించినా హృదయంలో ఎంత పవిత్రుడో, అది మనకు తెలియదు. వాడిని ఎందుకు అనుగ్రహించాడో ప్రక్కవాడికి కూడా తెలియకుండా అనుగ్రహిస్తాడు, వాడు ఈశ్వరుడు. మౌనదీక్షలో చూడటం ఉంది, తాకటం ఉంది, బోధించటం ఉంది. అన్నీ మౌనంలోనే ఐక్యమయ్యి ఉన్నాయి. మౌనం ఉత్తమోత్తమం అందులో జ్ఞానియొక్క చూపు, జ్ఞానియొక్క టచ్, జ్ఞానియొక్క టీచింగ్ కలిసి ఉంది.

గురువు చేసే పని గురించి భగవాన్ ఇక్కడ శిఖరానికి వెళ్ళి చెపుతున్నారు. ఒక మనిషిని అన్ని కోణాలలో చూసి, వాడి బ్రెయిన్‌లో ఎక్కడైనా చీకటి ఉంటే, ఏ వాసనల వలన ఆ చీకటి వస్తోందో చూసి, ఆ వాసనలను బయటకు లాగి కాల్చి బూడిద చేసి నిన్ను పరిశుద్ధ పరుస్తాడు. నువ్వు పరిశుద్ధుడవు అవ్వకుండా సత్యంలో ఐక్యం అవ్వలేవు. అందుచేత గురువు చేసేది ఏమిటి అంటే మొదట నిన్ను పరిశుద్ధపరుస్తాడు. నిన్ను పరిశుద్ధపరిచాక అప్పుడు నువ్వు సత్యంలో ఐక్యమవుతావు. ఇదంతా గురువు చేసే పని. భగవాన్ దగ్గరకు ఎవరైనా వచ్చి మిమ్మల్ని ఫొటో తీసుకొంటాము అంటే మీకు చేతనైతే తీసుకోండి అనేవారు. అంటే మీరు చైతన్యాన్ని ఫొటో ఎలా తీయగలరు? భగవాన్ అంటే ఎవరు చైతన్యం. చైతన్యాన్ని ఎవడైనా ఫొటో తీయగలడా? రూపంలేని వస్తువును ఫొటో ఎలా తీయగలరు?

ఏప్రియల్ 5 జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# ఉగాది

అనంతమైన కాలప్రవాహంలో మనము మరొక నూతన సంవత్సరములోకి అనగా శ్రీ మన్మథనామ సంవత్సరములోకి ప్రవేశించబోతున్నాం. కాలగమనంలో అనేక సంవత్సరాలు దొర్లిపోతూనే ఉన్నాయి. మనము స్థిరమని భావించే ప్రతివస్తువును కాలం హరిస్తోంది. మన శరీరాలు కూడా ఒక కాలంలో ఈ భూమి మీదకు వచ్చాయి కాబట్టి, కాలరూపంలో ఉన్న జీవితాన్ని సద్వినియోగం చేసుకొని కాలమునకు అతీతమైన స్వరూప అమృతస్థితిని 'తాను'గా 'నేను'గా అనుభవైకవేద్యం చేసుకోవాలి. కాల ప్రవాహము మరియు నదీ ప్రవాహము ఎలాగైతే దేనినీ పట్టించుకోకుండా, నిరంతరం తమ గమ్యం వైపే సాగిపోతాయో, అలాగే మనము హృదయంలో స్వరూపంగా ఉన్న పరమాత్మ గమ్యంగా సాగిపోవాలి. అంతర జీవితం ప్రారంభం అవడమే నిజమైన సాధనకు గుర్తు. మనస్సును శుద్ధిచేసుకొని, జనన-మరణ రూప సంసార సముద్రంలోంచి విడుదల పొంది, మరల ఇలాంటి దేహాలు రాకుండా, జన్మరాహిత్యాన్ని పొందడానికే ఈ భూమి మీదకు వచ్చాం. ఈ భూమి మీదకు వచ్చిన పని అంతకుమించి వేరేదీ లేదు. వాస్తవంగా తానెవరో? తెలుసుకొనుటకు పరమాత్మచే ప్రసాదింపబడిన గొప్ప బహుమతి ఈ మానవజన్మ. కాబట్టి దేహేంద్రియ మనోబుద్ధులను మోక్ష సాధనకు చక్కని పనిముట్లుగా ఉపయోగించుకోవాలి. ఒక నదిని దాటుటకు ఒక పడవను ఎలాగైతే ఉపయోగించు కుంటామో, అలాగే సంసార సాగరాన్ని గురుబోధ అనే పడవద్వారా దాటాలి. సచ్చిదానందమే మన యదార్థ స్వరూపము అయినప్పటికీ, సకల అరిష్టాలకు మూలమైన దేహాత్మబుద్ధి వలన అహంకార, మమకారములకు లోనై జనన-మరణ సంసార చక్రంలో పడి, పునర్జన్మలకు, దుఃఖమునకు, అశాంతికి లోనగుచున్నాము. జీవుడు వ్యక్తిభావనను విడిచిపెట్టి, తాను దేహమాత్రుడను కానని, అఖండ బ్రహ్మమే తాను అనెడి అద్వైతానుభూతిని పొందుటకొరకే ఈ మానవజన్మ ప్రసాదింపబడినది. కాబట్టి ఇప్పుడే, ఇక్కడే ఈ మహత్తర అవకాశాన్ని ఉపయోగించుకొని మన జీవితాన్ని, త్రికరణాలను స్వరూపానుభూతికి సహకరించేలా మలచుకొని తరించాలి.

(దిII 21-03-2015 ఉగాది పండుగ సందర్భంగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురువు తెలిపే గురుతుల మర్మపుబాట- సచ్ఛిశ్యులకు రక్షణ కవచం

మన మనస్సులో ఉన్న వాంఛలు చిట్టి తాళాలు లాగ, గజ్జల సవ్వడిగా, నిరంతరం ధ్వని చేస్తుంటాయి. వాటితో పాటు ప్రకృతి మనుషులు గోల మద్దెలలాగ మోగుతూంటాయి. కొందరికి ఇంటిలోని పోరు 'సృతి'లా నిరంతరం మోగుతుంది. కలికాలానికి అణువుగా మన మనస్సు ఆడుతుంది. అయ్యో వైరాగ్యాన్ని కాంక్షించాలనే కోరికకు స్థానం ఎక్కడ? మంచిని కోరేవాళ్ళు మంచిని చేస్తూ వినయంగా ఉండాలి. దారి చూపే పరమాత్మ అయిన గురువు మన పుణ్యఫలం వల్ల దొరికితే కొదవేలేదు. వేమన "చెడు గుణంబు లెల్ల జెబట్టి శిక్షించి; పరమపదవి సిద్ధిపడంగ జూపు; నట్టి గురుని వేడియ పరోక్షముందరా" అన్నారు. దీపం వద్దకు పురుగులు చేరినట్లు ఈ లోకంలో ఒక సద్గురువు అవతరించినపుడు సత్యాన్వేషకులు వారి వద్దకు వస్తారు. వారిలో సత్యమైన భక్తి ప్రేమలు మేల్కొంటాయి. పరుసవేది సోకితే తుప్ప పట్టిన ఇనుము కూడా బంగారమౌతుంది. పాపి కూడా గురు సంపర్కం వల్ల కృతార్ధుడు అవుతాడు. బుద్ధుని సంపర్కంతో అంగుళీ మాలకుడు లాగ గురు ప్రభావం క్రింద ఉన్న వాళ్ళు వారి పనులన్నీ సత్య నిష్టగానే ఉంటాయి. వాళ్లకు పునర్జన్మ బాధలేదు, మృత్యుభయం లేదు. గురువు విషయాన్ని శబ్దం రూపంగా ప్రవచిస్తాడు. "గురు ముఖ నాదం గురు ముఖ వేదం" దాని శక్తి వల్ల పరమాత్మతో మనకు తాదాత్మ్య స్థితి సిద్ధిస్తుంది. దానితో సమస్త పుణ్యకర్మలఫలం ఉంటుంది. ఆయన కృప వల్లనే 'ముక్తి' లభిస్తుంది. మన మనస్సు గురూపదేశాన్ని శిరసావహించినప్పడు అజ్ఞానం పోయి మనం పరమాత్మలో లీనమైపోతాము. సద్గురువు సత్యవచనాన్ని మనం అప్పడు ధరించి ఉంటాము. మన నాలుక భగవాన్ నామాన్ని స్మరిస్తూ ఉంటుంది. "గురువు ప్రపంచమంతా నిండి ఉన్న పరమాత్ముని మనచేత దర్శింపచేస్తారు. పరమాత్మలోనే ఈ సృష్టి అంతా నిండి ఉందని రుజువు చేస్తాడు" అంటారు పెద్దలు. సద్గురువు దర్శనం వల్ల అజ్ఞాన తిమిరం తొలగిపోతుంది. అహంకారం నశిస్తుంది. అప్పడు అన్ని బాధలు కొట్టుకొనిపోతాయి. సత్యదర్శనంతో నిశ్చలస్థితిలో ఉంటాము. గురు ఉపదేశాన్ని మనం నిరంతరం మననం చెయ్యాలి. శ్రీనాన్నగారు "గురువు తెలిపే సందేశాన్ని నిరంతరం మనస్సులో రుబ్బుకోవాలి అప్పడు అజ్ఞానం నామరూపాలు లేకుండా పోతుంది" అన్నారు. సత్యదర్శనంతో మనం మోక్ష ద్వారాన్ని చేరిపోతాము. గురువు విచారణలో మంచివాడు అని తేలినవాడే మంచివాడు. మన అంచనాలు నిజంకావు. సత్‌ప్రవర్తన లేనిచోట, కపటం ఉన్నచోట సుఖం, శాంతి రానే రాదు. గురువును ప్రేమించే నిజసాధకులు అంతా మంచివారే. గురువుపై విశ్వాసం తృప్తి, విధేయత, ప్రేమను మన ఆహారంగా ఉండాలి. అదే మనకు శక్తిని ఇచ్చి నిజధామానికి చేరుస్తుంది. శిష్యుడు అంటే నేర్చుకోవటానికి సిద్ధంగా ఉన్నవాడని అర్ధం. అంతేగాని గురువును కాబోతున్నాను అనే భావం వస్తే అహంకారంగా మారుతుంది. గురువును పూర్తిగా అంగీకరిస్తే ఆతడి మనస్సు నశిస్తుంది. గురువు మాత్రమే ఆతనిలో జీవిస్తాడు. నెమ్మది నెమ్మదిగా గురువు యొక్క ఉనికి శిష్యునిలో పెల్లుబుకుతుంది. జీవితం సార్ధకమౌతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**